# పుణ్యప్రేమము

(భారతి - నవంబర్ 1930)

సుభద్ర పసుపుపచ్చని మనిషి. ఆజానుబాహువు. కన్నులు చెంపకు చేరిడేసి వక్షోజఘనములు పురఃపశ్చాత్ప్రసృప్త రజతగిరి నితంబములు. ఆమె జడచుట్టిన శిరోజభారము, గిరి నితంబాగ్రలంబి నల్లతుమ్మెదలు ముసరిన తేనెపట్టు.

ఆ సౌందర్యవతి తెల్లని పట్టుచీర దాల్చినప్పుడు శరన్మేఘశకల వాహనయగు శచీదేవి. ఆకుపచ్చని చీర తాల్చినప్పుడు శ్రావణము నాటి పచ్చని పచ్చిక బయళ్ళు తోడి పుడమి పడతి. ఇంకొక రంగుచీర నామె కట్టనే కట్టదు. ఇది యామె బహిస్సౌందర్యము.

ఆమె అంతస్సు చందనాగురు కస్తూరికా పరిమళితము. ప్రాత శ్శిరీష కుసుమ కోమలము. ఆ మనస్సులో ఆమె చదివిన భారత భాగవతముల వాసన గుప్పున కొట్టుచుండును. అలంకారశాస్త్ర మామె నేత్ర నాళముల యందు తరంగములు తరంగములుగా ప్రవహించుచుండును. ఒక్కమాటలో నామె రసమూర్తి.

ఆ సౌందర్యాధిదేవతాత్వము. ఈ రసాకృతిత్వము సన్నని వళిపపు చందురుని కిరణములువోని దారములు తీసి సుభద్రాదేవి తన ప్రాణపతి కృష్ణరాయని చుట్టు తళతళలాడు సాలీడి గూడల్లినది.

కృష్ణరాయలు సాలుకు నాలుగు వేలాస్తి యప్పగించిన తల్లిదండ్రుల కొక్కడే గారాలకూచి. యఫ్.ఏ. చదువుచు ప్రథమ సహాయనిరాకరణపు నాళ్ళలో మానివేసినాడు. తరువాత తరువాత సంస్కృతాంధ్రములయందు పరిశ్రమ చేసి పాండిత్యము కన్న రసజ్ఞత్వ మెక్కువ సంపాదించినాడు. రూపమున నా శచీదేవికి శతమఖుడు; ఆ ధారణీదేవికి తగిన హృషీకేశమూర్తి.

వారిదాధునిక నాగరికతా నిలయములైన పట్టణముల కెడమైన పల్లెటూరు. సుభద్రకు ఆధునిక నాగరికత యన్నచో పచ్చగడ్డి వేసిన భగ్గుమనును.

పచ్చగడ్డి వేసిన భగ్గుమను నన్ను యీ నానుడి యామె స్వభావము నందలి తైక్ష్ణ్యమును మాత్రమే చెప్పును గాని యామె స్వభావము నందలి యర్థచ్ఛాయ కూడ తగులదు. ఒకనాడు పితృకార్యవేళ కృష్ణరాయ దుచ్చరించిన హూణ శబ్దముల యందు సుభద్ర సూచించిన ప్రణయ శాసనము కారణముగా నతడామె యెదుట నప్పటినుండి హూణభాషా శబ్దముచ్చరించడు.

ఇంక వారి ప్రేమకథ విచిత్రమైనది. ఒకరి హృదయపు పొరలలో నొకరు దూరినట్లు వారొకరుద్దేశించిన పనులొకరు తెలుపుకొనకయే గ్రహింతురు. చేయుదురు. వారికంటి చివరలలో, బొమల కదలికలలో, అవయవ విలాస చాలనములలో, వారికొకరి యెడంద లొకరికి గోచరించుచుండును. విచిత్రముగ వారొకరి కొకరు సంబంధించినంతవఱకు వారి హృదయములు వారి సర్వావయవ తచ్చాలనము నిండి నిబిడీకృతమై, యితరుల యెడ వారి హృదయములు హృదయస్థానములనుండి రేఖామాత్రమైన కదలవు.

వారిరువురకు వారి వారి ప్రేమల యొక్క నైశ్చల్య నైర్మల్యముల యందు మహాభిమానము.

అక్షయ సంవత్సరాషాఢ శుక్లమున నొకనాడు సుభద్ర క్రొత్తగా పుట్టింటి నుండి వచ్చినది. పరిష్వంగ త్వరకల యా దంపతుల కానాటి ప్రొద్దెంత యాలస్యముగ క్రుంకవలయునో యంత యాలస్యముగ క్రుంకినది. డాబామీద పరుపు వేసి విరియబూచిన మల్లెలు, మొగ్గ దగ్గర త్రుంచి తెచ్చి ప్రక్కపై వెదజల్లి, సుభద్ర మడికట్టుకొని వంటచేసి పతికి భోజనము పెట్టుచుండెను. అంతలో మేఘములు నల్లగా నాల్గుదిక్కుల క్రమ్మి యింద్రుని రథపు శాయమే కూడిపడ్డట్లుఱుమ సాగెను. సుభద్ర యత్తగారు నేను వడ్డించెదను. నీవు పోయి డాబా మీద ప్రక్క తీసుకొని రమ్మన్నది. సుభద్ర కదలలేదు. గంట ముప్పావుగంట మేఘములు కొన్ని పోవుచు, మఱల కొన్ని మూగుచు, మధ్యమధ్య చినుకులు తపతప రాలుచునే యున్నవి. పైనన్నమాట యత్తగారు నాలుగుసారులన్నది. కృష్ణరాయలు గూడ నొకసారి ప్రక్క యెత్తుకు రారాదా' యనెను. చిక్కని పెరుగు గడ్డ వెండిగిన్నెలో పడిన చప్పుడుకామాట యామెకు వినబడలేదు.

కొంతసేపటి కొక పూలరంగని వంటి గాలి షికారు బయలుదేరి మొగిళ్ళ తనకాళ్ళ జిమ్ముకొంచు పోయెను. రాత్రి జాముస్నర ప్రొద్దుపోయిన వేళ నొక యవ్యయానంద నిమేషమున "ఆకాశము నిర్మేఘముగ నున్నది. చంద్రుడు గూడ నాకాశమున ప్రకాశించుచున్నా" డన్న భర్త మాటకు సుభద్ర తనలో నది తన ప్రేమనైర్మల్యఫల మనుకొన్నది.

సుభద్ర సమస్తములైన ఫలములతో నోము నోచినది. కాని పనసపండ్లతో నోచలేదు. ఆ మరు సంవత్సర చైత్ర మాసములో పనసపండ్లతో నోము నోతమనుకొన్నది. డబ్బిచ్చి కృష్ణరాయలు మనిషిని భీమవరమునకు పంపించినాడు. వాడు తిరిగి యింటికి ఊరికే వచ్చెను. ఎవరో పెద్దరాజుగారి కుమార్తె పెండ్లియట; భీమవరము, నర్సాపురము, తణుకు, మారుటేరు, పాలకొల్లులలో నెక్కడను పండ్లు దొరకలేదు. రెండు నెలలకు ముందుగనే రాజుగారు బజానాలిచ్చి పండ్లన్నియు తన వశము చేసుకొన్నాడని వార్త తెచ్చెను. ఱేపు పూర్ణిమ. ముత్తయిదువులను పిలిచెను. జయంతుని పెండ్లినాటి శచీదేవి వలె తిరుగుచున్న యామె యీ వార్త విన్నంతనే నిర్జీవి యయిపోయెను. ఇంట నందరు విచార కబళిత ముఖులై యుండనే యున్నారు. ఇంతలో కృష్ణరాయని స్నేహితుడొకడు భీమవరమునుండి యేబది పనసపండ్లు బండిమీద వేసికొని వచ్చినాడు. అందరు నాశ్చర్యపోయిరి.

వెనుక నొకసారి కృష్ణరాయలు తన స్నేహితునితో తన భార్య పనసపండ్లతో వ్రతము చేసికొనవలె ననుకొనుచున్నది. తెచ్చి పెట్టెదవా యని యతని నడిగెను. అతడాచోట పలుకుబడి కలవాడగుట, రాజుగారి వద్ద నుండి యీ పండ్ల కనుమతి పొంది యీ వేళకు తెచ్చెను.

వాడిపోయిన కాకరపాదు వాన పడినంతనే పూలతో, పిందెలతో కలకలలాడినట్లు మఱల నిల్లంతయు నుత్సాహపూరితమై పోయెను.

ముత్తయిదువలకు వాయనమిచ్చి దొడ్డిలోనికి దేనికో పనిమీద పోయిన సుభద్రతో గిత్తలకు జనపకట్ట వేయుచున్న కృష్ణరాయలు నా ప్రేమ నిష్కాలుష్య మిట్టిది. తలవని తలంపుగా పనసపండ్లు వచ్చినవి యనెను. ఆమాట కొక్క యెదబంటి చూపుతో బదులు తీర్చి సుభద్ర లోనికి బోయెను.

నాయనా! మీ కడుపున కాయకాచినచో చూచి పోవలయునురా యను తల్లిగారి చాలసారులన్న మాటలతో, కొడుకు కోడండ్ర యెదలలో తమ ప్రేమకు బహిశ్చిహ్నము చూడవలెనన్న కోరిక, సుభద్రలో నదిమిన సిగ్గులో, కృష్ణరాయనికి నవ్విన మాటలో, పొడసూక యొకొక్కసారి తలుకు తళుక్కు మనుచుండును. ఆ యేడాది యంతయు నట్లే గడిచినది.

**(2)**

ఆ యేడాది వెళ్ళిన తోడనే యేమో చల్లని వర్షర్తువు క్రొత్త యేడాది మొదలుపెట్టినట్లు శ్రావణము నూతన భావములతో చెలరేగెను. ఉబ్బువాన కురిసి వెలిసిన పెద్ద యెత్తయిన మబ్బు నల్లని నీడలలో దూరపు చెట్లు పొదవోలె నున్న నల్లని కనుబొమ్మలు కలవాని చూపువలె నవ్యక్త గంభీరముగ నుండెను. దొడ్డిలోని గుజ్జు నేరేడు లొత్తుగా కాచి నేరేడు పండ్లు పూర్వమెప్పుడో వేదములు ముచ్చిలిపోయిన యుగాన నాదిమత్స్యగర్భమైన గ్రుడ్డు బహూకృతమైనట్లుండెను. నల్లని వర్షర్తువు దొంగవాని వలె గదులలో దూరి పగలే ప్రభ సాగించెను.

ఆ చీకటిలో సుభద్ర తన యింటి గదిలో కూర్చుండెను. అచ్చట వెలుతురు గ్రుడ్డిగా నున్నది. కలవారి యింటికోడలు, చూలు నిలిచిన పండుగచేసి సెనగలు పేరంట మిచ్చిన తరువాత నామె కట్టిన కొత్తచీరతో, పెట్టిన కాటుకతో, రాచిన పారాణితో, వృథాకుపితయైన శర్వాణి వలె నామె మూల కూర్చున్నది. కృష్ణరాయలు లోనికి వచ్చి యామెను చూచి మందహాసము చేసెను. ఆమెకు నవ్వు వచ్చెను. వచ్చిన నవ్వాపుకొని మొగములో నున్న కోపమే నిలిపెను. ఇంతలో నెవరో గదిలోనికి వచ్చుటచే నకారణ మున ప్రగల్భమునైన యా కోపమును రాయలు తీర్ప వీలుచిక్కలేదు.

రోజులు గడచిన కొలది నామె మనస్సతనికి పరిచితమే యయ్యు శరీర మపరిచితము నధికము చేసికో దొడంగెను. కోపమట్లు కాని ముఖలక్షణములతో సమార్దవ పరిహృత భర్తృపరిష్వంగ ప్రయత్నముతో నేడవనెల దరిసెను. పుట్టింటికి తీసుకువచ్చిన యన్నగారి వెంటబోవుట కేమియు నిష్టము లేక వెళ్ళుచున్న సుభద్ర కౌగిలి యాఱు నెలలకు కృష్ణరాయనికి తటస్థించెను. కాని యది యుభయులకు భాష్పముల తడి చేత వెంటనే జారిపోయెను.

గబగబ నేదో పనియున్నట్లింటిలోనికి పోవుట, మఱల వాకిలి లోనికి వచ్చుట యీ పనిచేయుటతో కృష్ణరాయనికి రెండు నెలలు గడచినవి. నాయనా! ఒకసారి పోయి చూచిరారా అన్న తల్లిమాట తల్లికే మిగిలినది. సంకల్ప వికల్పముల నడుమ గతాగతకారియైన యతడు భార్యను చూడనే లేదు.

వసంతకాలము వచ్చెను. అది వసంతము సొగసు కాబోలు; ఎండ వేడిమి కాగలేక కూసిన కోకిల కూతలలోనే మాధుర్యము వెల్లివిరిసినది. ఎండ పిందెలు, ఎండపూవులు గూడ రుచి హెచ్చినవి. పరిమళించినవి ఎట్లయిన నేమి? వసంతకాలము ప్రాణము హాయి అనిపించినది.

సుభద్రకు గర్భకార్శ్య మట్లుండగా, పతి తన్ను చూడరాలేదన్న చింతాకార్శ్య మెక్కువయినది. 'ఇప్పుడు నాతో నేమిపని యనుకొన్నది'.

ఏరోజున కారోజున ప్రొద్దున లేచిపోదమని కృష్ణుని యూహ. ప్రొద్దున లేచిన వెంటనే యథాస్థితి జాప్యము.

ఒకనాడు ప్రొద్దున కృష్ణరాయలుగారి వంటయింటి దగ్గర కాకి కూయ మొదలిడెను. అతని తల్లి 'కాకమ్మా! కాకమ్మా! కబురు చెప్పు. మా తల్లి నీళ్ళాడెనా లేదా' అని సోదె అడిగినది. కాకి గల్లున గంతువేసి కూసి యెగిరిపోయినది.

కాకి యిట్లా వెళ్ళినది. అట్లా కబురు వచ్చినది. సుభద్ర చిన్ని మగవాని గనెనట, శాంతి తగిలెనట. కృష్ణరాయని వికల్పజాడ్యము వదలినది. కాని శాంతి వికల్పస్థాన మాక్రమించినది.

శాంతి యింటికడనే చేసికొనుటకు నిశ్చయించి యిఱువది యొకటవ నాటికి సుభద్రను తీసుకొని వచ్చిరి. మూగిన యూరి యాడవారందరు వారి దారిన వారు పోయిన తరువాత కృష్ణరాయలు సుభద్ర యేకాంతముగా కలిసికొనెను. పతి కౌగలించు కొనబోయెను. కాని సుభద్ర యొక నిశితమగు చూపు చూచెను. అందుచే నా కౌగిలింత జరుగునప్పటికి చాలాసేపు పట్టినది. శాంతివేళ నూనెలో తండ్రి కొడుకుల మొగముల రెండు నీడ లొకేసారి చూచిన సుభద్రకు వారి పోలిక మఱింత వ్యక్తమయ్యెను. కొన్నాళ్ళు గడిచెను.

ఒకనాడు సుభద్ర యేదో కుట్టుకొనుచున్నది. కృష్ణరాయలేదో చదువుకొనుచున్నాడు. పిల్లవాడు నిద్రపోవుచున్నాడు. సుభద్ర కుట్టు నాపి తలయెత్తి

"అయితే మీరు మా వాళ్ళ యింటివద్ద నుండగా నొక్కసారియైనను రాలేదు కదా?" అనెను.

అతడు పుస్తకమాపి యామె వంక చూచెను. ఆమె చూపులలోని ప్రశ్న మట్లేయుండెను. అతడేమి సమాధానము చెప్పుటకును తోచక 'నీవొకయుత్తరమైనను వ్రాయలేదేమి?' యనెను.

"నేను వ్రాసినచో నింట నెవరైన చూడరా" యనెను.

"ఏమి చూచినచో?" అని కృష్ణరాయలు ప్రశ్నించెను.

సుభద్ర దానికి బదులు చెప్పక మఱల తనపని తాను చేసికొనుచుండెను. అతడామె వంక చూచుచునే యుండెను.

ఆమె తల యెత్తకుండ నిట్లన్నది. ఆ రోజులలో నేనసలే బలహీనముగా నున్నాను. మీరు రాలేదన్న దిగులుచేత నన్నమే సయించినది కాదు. మఱీ చిక్కిపోయితిని. నా "బలహీనత కుఱ్ఱవాని బలుపుకు చెఱుపు చేయు నన్నారందరును!"

కృష్ణరాయలు కుఱ్ఱవానివంక చూచినాడు. రెండు నెలల పిల్లవానికి రెండువందల నగలు పెట్టిరి. అతడు వారి మాటలకు, తనకు సంబంధము లేనట్లు నిద్రపోవుచునే యుండెను.

మరికొంతసేపటికి సుభద్ర "మీకు నామీద ప్రేమ లేదు" అన్నది. ఆమె కాపురమునకు వచ్చి నాలుగేండ్లయినది. ఇట్టిమాట యామె నోటివెంట నెన్నడు రాలేదు. ఇంతలో కుఱ్ఱవాడు కనులు విప్పి చూచెను.

సుభద్ర పిల్లవానిని తీసుకొని "ఇదిగో నాప్రేమ చిహ్నాము" అని కుఱ్ఱవానిని పతికిచ్చెను. అతడు పసివానిని గట్టిగా కౌగలించుకొని ముద్దు పెట్టుకొని, నా ప్రేమచిహ్నాము వీడే యని యామెకు మఱల నందిచ్చెను.

అదివఱకా పుణ్యదంపతుల హృదయము లొకరి వొకరి హృదయములలో నుండెను. ఇప్పుడవి రెండును చేరి పసివానిలో ప్రవేశించెను. సుభద్రకు భర్త ప్రేమ యంతయు పసివానిలో తోచుచుండెను. కృష్ణరాయలకు భార్యా ప్రేమ యంతయు పిల్లవానిలో దోచుచుండెను.

ఒకరోజున సుభద్ర అన్నది "మీకు నామీద కన్న నబ్బాయి మీదనే యెక్కువ ప్రేమ అని

కృష్ణరాయలు అన్నాడు. 'నాకు అబ్బాయియే నువ్వు. నీకు అబ్బాయియే నేను!"

ఆ ముగ్గురి మధ్య మూడు కౌగిలింతలలో ప్రస్తావన ముగిసింది.

**(3)**

పిల్లవానికి ఆఱు ఎనిమిది నెలలు వచ్చినవి. పిల్లవానికి తలంటిపోసి, యాముదము రాచి, కనులకు కాటుక పెట్టి, మొగాన చుక్కపెట్టి, తొట్టిలో పండుకొనబెట్టి యూపినపుడెల్ల సుభద్ర వానిని చూచి భర్తయందలి తన ప్రేమ యంత యకల్మషమని, స్వచ్ఛమని యూహించుకొనుచుండును. వాడు తనవద్ద పాలు త్రాగుచున్నప్పుడెల్ల తన జీవిత సర్వస్వము తన ప్రేమలో ప్రవహించుచున్న దనుకొనుచుండును.

పిల్లవాని యొడలు నాముదమారి మేల్కొన్న తరువాత వానికి నగలన్నియు పెట్టి భర్తచేతికి ప్రతిదినము మధ్యాహ్నము దాటి యిచ్చినపుడెల్ల కృష్ణరాయలు భార్యయందలి తన ప్రేమ కుఱ్ఱవానిలో మూర్తి కట్టినదను కొనుచుండును.

వానిని తాను లాలించినంతసేపు తన జీవితము తన ప్రేమకై వినియోగించుచున్నానని యతడనుకొనుచుండును.

పిల్లవానికి పన్నెండు నెలలు గడిచినవి. పుట్టినరోజు పండుగకు సుభద్రా పతి పెండ్లియంత హడావిడి చేసినాడు. పిల్లవానికి ఆనాడు బంగరు మొలత్రాడు, మెడలో పులిగోరు, కాళ్ళకు గజ్జెలు, చేతులకు రెండు మురుగుల జతలు పెట్టి, కుర్చీలో గూర్చుండ బెట్టుకొని - సెనగలు, కానులు కలిపి దిగబోసి, పేరంట్రాండ్రందరు పాటలు పాడిన తరువాత సుభద్ర కంఠమెత్తి .....

*"బాలాయ నీలవపుషే నవకింకిణీక*
*జాలాభిరామ జఘనాయ దిగంబరాయ*
*శార్దూల దివ్యనఖ భూషణ భూషితాయ*
*నందాత్మజాయ నవనీతముషే నమస్తే"*

అని శ్లోకము పాడెను.

అందలి మృదుభావ తరంగ పరంపరచే సుస్నిగ్ధమై సుసంస్కృతమైన యామె హృదయము కరగి యామెలోని భక్తిభావము, పిల్లవానియందలి యనురాగము, తన ప్రేమమయ జీవిత నిగూఢ రహస్యము నన్నియు గలిసి యవ్యక్త మయిన యొక స్రోతోరూపము తాల్చియామె కన్నులవెంట జాలుగా ప్రవహించెను.

నిశ్శబ్దలై తక్కిన స్త్రీలామె వంక జూచి కొంతసేపటివఱకామె హృదయమెఱుంగక యామె నోదార్చవచ్చిరి. 'శుభవేళ కన్నీరేల' నని కొందరు ఆమె మనస్సులో నేమున్నదో యని కొందరు జానపద వైఖరి ప్రదర్శించిరి. ఆమె మనస్సౌకుమార్య మెవరికిని దెలియలేదు. ఆ రాత్రి పిల్లవాడు పోరుపెట్టి యేడ్చినాడు. తల్లియు, ముత్తవతల్లియు తల్లడిల్లిపోయినారు. కచ్చికదృష్టి, ఏకుదృష్టి తీసిరి. పోరు మానలేదు. ముత్తవతల్లి చివర కుప్పు గూడ తీసి నూతిలో వేసెను. రాత్రి రెండు జాములు దాటువరకు పిల్లవాడు చేతిలో నిలువలేదు. అప్పటికి కొంచె మఱకూర్కి మఱల తెల్లవారు కడ నేడువ మొదలుపెట్టెను. కొంచెము పడిశము పట్టెను.

మూడు రోజుల వరకు పిల్లవాడదే నలతగా నున్నాడు. నంబి, పూజారి, మంగలులు ముఖ్వరు వచ్చిరి. చూచిరి. ఏవో మాత్రలిచ్చిరి. ఏమియు నయములేదు. సుభద్ర ప్రాణములు గుప్పిటలో బట్టుకున్నది. కృష్ణరాయలు తెలతెలబోయినాడు.

నాల్గవనాడు పిల్లవానికి భారము చేసినది. ప్రొద్దుక్రుంకువేళకు 'మగత' కప్పినది.

ఇంట శోకదేవత ప్రవేశించినది. చుట్టకాల్చి నొసట నంటించిరి. ఉల్లిపాయ నమిలి ముక్కులలో నూదిరి. బ్రహ్మజెముడాకు రసము పోసిరి. పిల్లవాడు గుక్కత్రిప్పుకొన్నట్లే త్రిప్పుకొని తల్లిదండ్రులతో విడాకులు పుచ్చుకున్నాడు.

కృష్ణరాయనికి నెత్తిన పెద్దపర్వతము పడినది. సుభద్ర యొడ్డులేని సముద్రములో నీదుచున్నది.

మూన్నాళ్ళు గడిచినవి. భార్యాభర్తలొకరి నొకరు చూచుకొనలేదు. ఈ మూన్నాళ్ళును శిశుదుఃఖమే వారి హృదయము లందు నిండియున్నది.

నాల్గవనాడు సుభద్ర స్నానము చేయుచుండగా పొరుగమ్మ యొకావిడ వచ్చి 'వాడెవ్వడు, మీరెవ్వరు? వానికేదో ఋణమున్నారు. వాని ఋణము వాడు తీర్చుకొని పోయినా'డని యోదార్చినది. సుభద్ర కామాటతో పుత్రదుఃఖము శాంతించినది. మఱల కొంతసేపటి కామె హృదయములో జూడరానంత మేర యెడమై యందు తాను తన పతి యెడల ద్రోహి నన్న భావము కాలు పెట్టినది. ఈ భావము గడియ గడియకు వృద్ధిపొంది ప్రొద్దు గ్రుంకు వఱకు నామె హృదయమంతయు నిండిపోయినది.

రాత్రి పడ్డది. ఎంతచెప్పినను సుభద్ర భోజనము సేయక పండుకొన్నది.

రాత్రి రెండుజాములు దాటినది. అందరును నిద్రబోవుచున్నారు. దొడ్డిలో చీర కొంగు పఱచుకొని పండుకొన్న సుభద్రయు, వాకిట నుత్తరీయము పఱచుకొని పండుకొన్న కృష్ణరాయలు తక్క తక్కిన జంగమ జగత్తంతయు జడమైనది.

ఇరువురి హృదయము లొక్కతీరుగా మండిపోయినవి.

ఇరువురి మనస్సు లొక్కరీతిగా నూహించినవి.

ఇరువురి యాత్మ లొక్కరీతిగా నిలిచినవి.

"నాప్రేమ నిష్కల్మషమైనచో మా పుత్రుడేల చనిపోవును? నేను నాకు తెలియనిదేదో దోషము నా భార్య (లేక భర్త) యెడల చేసితిని. అయ్యయ్యో! ఆ పవిత్రాత్మకు నాయందు సంపూర్ణముగా ప్రేమ లయింపచేసిన యా మనోమూర్తికి, నేనెంత ద్రోహము చేసితిని! మా శిశువునందు నా ప్రేమ యకల్మషత, స్వచ్ఛత – సంపూర్ణముగా గోచరించిన వనుకొంటినే. ఆ ప్రేమయే నిష్కల్మషమైన, నా ప్రేమ చిహ్నమైన మా శిశువునకీ స్థితి రాదు".

కొంతసేపు వారి యిర్వురి మనస్సు లొక్కసారిగా నిల్చిపోయినవి.

తెల్లవారుజాము కోడి కూసినది. తూర్పు చుక్క పొడిచినది. మఱల వారి యూహ లిట్లు సాగినవి.

"తెల్లవార బోవుచున్నది. ఇంతద్రోహము చేసిన నా ప్రియురాలిని (లేక ప్రియుని) ఎట్లు చూతును? ఏ మొగము పెట్టుకొని యతని (లేక యామెను) పలుకరింతును? నే నా మొగము మీద చూపులు నిలుపలేను. ఈ నా దోషమునకు

నిష్కృతి లేదు. ఈ నా దోషగత ప్రేమము నిష్కల్మష మెట్లగును? నిర్దోషమగుట యెట్లు? నేను మాత్రమా మొగము మఱల చూడలేను. చూచినచో నాహృదయ మొక్కసారిగా సహస్రధా శకలితమగును. నేను చూడలేను. ఏ మొగము పెట్టుకొని చూడగలను?"

ఇద్దరి కనుగొనల నుండి భాష్పములు కురిసెను. హృదయములు గంటకు వేయిసార్లుగా కొట్టుకొనెను.

మఱల వ్యథాకులితులు, నిర్వాక్కులు నిశ్శరీర సుఖులునగు నా దంపతులకు మూన్నాళ్ళు గడచినది.

సుభద్ర నోదార్చుటకు పుట్టింటికి తీసికొని పోదుమని ఆమె తల్లియు, నన్నగారుననిరి. కృష్ణరాయనితో చెప్పిరి. దుఃఖము, నిరాశ పెనవేసికొని లజ్జ యుబికిన స్తంభ మతని శరీరమునందు తోచి యతడు నిరుత్తురుడయ్యెను. తన యెడలు తన మనస్సు తానెఱుగని స్థితిలో సుభద్రను పుట్టింటికి తీసుకొని పోయిరి. సుభద్ర పుట్టినింట మూడు నెలలుండెను. ఆఱు నెలలుండెను. ఎప్పటికప్పుడు సద్యోమృతపుత్ర విరహిణివలె నుండును గాని మార్పులేదు. ఊరి వారందరు వచ్చిరి. రోజురోజోదార్చిరి. పతియెడల తాను చేసిన ద్రోహమును కొని యామె దుఃఖించుచున్నదని వారికి తెలియదు. వారి యోదార్పు మాటలు కారణ మెఱుగని వైద్యము వలె నిరర్థకము లయ్యెను.

ఇంటివద్ద కృష్ణదేవరాయలు మౌనియైనాడు. నవ్వుచు, త్రుళ్ళుచు నుండు నాతడు కొడుకు చావుతో మారినాడనుకొన్నా రూరి వారందరు. అతడెవ్వరితోడను మాటాడడు. క్రమక్రమముగా వ్యవసాయ మెత్తివేసెను. పొలము కౌలునకిచ్చెను. వాకిట పశువులే లేవు. 'నాయనా! కోడలిని తీసుకు రావురా' యని తల్లి యనును. అతడు కూర్చున్నవాడు లేచి వాకిలి లోనికి పోవును. తల్లి యూరివారిచేత ప్రస్తావింపచేసినది. కృష్ణరాయలు వినుచు దలాడించెను.

ఎన్నాళ్ళయిన నింతేనని యన్నగారు సుభద్ర నొకనాడత్తవారింటికి తీసుకొని వచ్చెను. సుభద్ర యింటికి వచ్చునప్పటికి రాయలూరలేదు. అప్పటికి పదిరోజుల క్రిందట శ్రీశైలము పోయెదనని చెప్పి వెళ్ళినాడు.

సుభద్ర యచట నొక నెల యుండెను. ఆమెకు క్షయ వ్యాధి పుట్టెను. శచీదేవి శవాకృతి వచ్చినది. భూదేవి పూచికపుల్లయైనది. మఱల నన్నగారు తీసికొని వెళ్ళినాడు.

ఆమె వెళ్ళిన పదిరోజులకు కృష్ణరాయలింటికి వచ్చినాడు. గడ్డము పెరిగి పిచ్చివానివలె నున్నాడు. సుభద్ర జబ్బు సంగతి తల్లి యతనితో చెప్పెను. కృష్ణరాయలు గడప లోనివాడు గడపలో నుండియే యత్తవారింటికి పోయినాడు. పాపమతనికి సుభద్ర చూపు మాత్రమే యందినది. ఆ చూచినపుడు సుభద్ర కన్నులలో నీరు తిరిగి యవ్యక్తముగా నీ మాటలు నోట వచ్చినవి. "నా ప్రేమలోని నాకు తెలియని కాలుష్యము వలన నీ కొడుకు పోయినాడు. క్షమింపుము" ఆమె చేతులెత్తి నమస్కరించబోయినది. చేతులు రాలేదు. మరునిముషమున నామెలో చైతన్యము లేదు. కృష్ణరాయలు "అయ్యో! నా తప్పుకాని, యది నీ తప్పుకాదు" అని విరుచుకు పడిపోయెను.

***

కొన్నాళ్ళకు వారణాసీ ఘట్టమున నొక పురుషుడు, నొక స్త్రీయు, నొక మృత శిశువును పాతిపెట్టుచుండిరి. ఒక బాల సన్యాసి దారి వెంటబోవుచు నచట నిలిచి చూచుచుండెను. వారతనిని చూచి స్వామీ! ఏ మట్లు చూచెదరు' అని యడిగెను. సన్యాసి యా శిశువు మీ శిశువేనా అనెను. వా రగు ననిరి. "మీరిర్వురు భార్యాభర్తలేనా?" యని సన్యాసి మఱల ప్రశ్నించెను. వారు చిత్తమనిరి. సన్యాసి ఓయీ! శిశువులు దీర్ఘాయువు లగుటకు తల్లిదండ్రుల ప్రేమ నిష్కల్మషమై యుండవలెను. ఆ నిష్కల్మషత యెట్లు పాలించవలయునో మనకు తెలియదని చరాలున పోయెను. వారు తెల్ల తెల్లపోయిరి.